ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
గురువారం 24 జూలై 2025

● మూడు జిల్లాల కలెక్టర్లతో స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్

పథకాల అమలుపై
ఆస్పత్రి నుంచే సీఎం సమీక్ష

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్వల్ప అస్వస్థతకు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అక్కడి నుండే తన విధులను నిర్వర్తిస్తున్నారు. బుధవారం ఉదయం ఆయన 'ఉంగలుడన్ స్టాలిన్' పేరుతో రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రజావిజ్ఞప్తుల పరిష్కార పథకం లబ్ధిదారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఆ సందర్భంగా కన్నియాకుమారి జిల్లా కలెక్టర్ ఆర్.అళగుమీనా, కాంచీపురం జిల్లా కలెక్టర్ కలైసెల్వి మోహన్, కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ భవన్‌కుమార్ జి.గిరియప్పనవర్‌తోనూ ఆ పథకం ఏ విధంగా అమలవుతున్నదో, ఆ పథకానికి ప్రజా స్పందన ఎలా ఉందో వీడియో కాన్ఫరెన్స్' నిర్వహించారు. ఉంగలుడన్ స్టాలిన్ పథకం కింద స్వీకరించే వినతిపత్రాలపై చర్యలు చేపట్టేందుకు 45 రోజులు గడువున్నప్పటికీ ఆ వినతుల్లో పేర్కొన్న సమస్యలు ఒకటి రెండు రోజుల్లో పరిష్కరించేదిగా ఉంటే వాటిని అప్పటికప్పుడే పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశించారు.


ఆస్పత్రి నుంచి లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న స్టాలిన్

జిల్లాల వారీగా ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ శిబిరాలు ఎన్నింటిని జరిపారో కలెక్టర్ల ద్వారా తెలుసుకున్నారు. అదే సమయంలో ఆ మూడు జిల్లాల్లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక శిబిరాలలో విజ్ఞప్తులు సమర్పించేందుకు వచ్చిన స్థానిక ప్రజలతోనూ స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్, వీడియో కాల్‌లో మాట్లాడారు. ఈ సమావేశంలో స్టాలిన్‌తోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానదం ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు డిశ్చార్జ్! : ఆస్పత్రి నుంచి సీఎం గురువారం సాయంత్రంలోగా డిశ్చార్జ్ అయ్యే అవకాశముందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రిలో వైద్యనిపుణులు స్టాలిన్ వైద్య పరీక్షల వివరాలను పరిశీలిస్తున్నారు. ఆ రిపోర్టులను బట్టి స్టాలిన్ ఆరోగ్యానికి సంబంధించి సూచనలు చేయనున్నారు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం ఎంకే అళగిరి, మంత్రులు కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, డీఎంకే నేతలు స్టాలిన్‌ను పరామర్శించారు.

వ్యక్తిగత ఆదాయంలో రెండో స్థానం

● 'ద్రావిడ మోడల్ 2.0'లో అగ్రస్థానం ● సీఎం స్టాలిన్

పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ మోడల్ 2.0లో వ్యక్తిగత ఆదాయంలో రాష్ట్రం అగ్రస్థానానికి చేరుకుంటుందని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. పలు శాఖల్లో తమిళనాడు ముందంజలో ఉందని, జాతీయ స్థాయిలో వ్యక్తిగత ఆదాయంలో పొందుతున్న వారిలో తమిళనాడు రెండో స్థానంలో ఉందని మంత్రి తంగం తెన్నరసు తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మంత్రి పోస్ట్ చేసిన వివరాలపై సీఎం స్టాలిన్ తన ఎక్స్ పేజీలో... 'మనం జాతీయ సగటును అధిగమించాం. గత అన్నాడీఎంకే పాలన వృద్ధిని రెండింతలు అధిగమించాం. తదుపరి రానున్న ద్రావిడ మోడల్ 2.0 పాలనలో దేశంలోనే వ్యక్తిగత ఆదాయంలో ప్రథమ స్థానంలో నిలుస్తాం' అంటూ సీఎం ట్వీట్ చేశారు. ఈ నెల 21న లోక్‌సభలో కేంద్ర సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపిన వివరాల ప్రకారం, జాతీయ స్థాయిలో వ్యక్తిగత ఆదాయం రూ.1,14,710 కోట్లకు పెరిగింది. ఇది 2014-15లో రూ.72,805గా ఉండగా, ప్రస్తుతం 57.5 శాతం పెరిగింది. 2024-25లో జాతీయ స్థాయిలో వ్యక్తిగత ఆదాయంలో కర్ణాటక రాష్ట్రం రూ.2,06,605 ఉండగా, తమిళనాడులో రూ.1,96,309గా ఉంది. అలాగే, తమిళనాడు రాష్ట్రాభివృద్ధి 9.69 శాతంగా ఉందని ప్రకటించారు.


జయంత్యుత్సవాల ప్రారంభోత్సవంలో మంత్రులు తంగం తెన్నరసు, శివశంకర్, స్వామినాథన్, రాజేంద్రన్ తదితరులు

అట్టహాసంగా రాజేంద్రచోళుడి
జయంత్యుత్సవాలు ప్రారంభం

ప్యారీస్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చక్రవర్తి రాజేంద్రచోళుడి సహస్రాబ్ది జయంత్యుత్సవాలు అరియలూరు జిల్లా గంగైకొండ చోళపురంలో రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 10వ శతాబ్దానికి చెందిన రాజేంద్రచోళుడు తమిళనాడు సహా ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, ఒడిశా, పశ్చిమ బెంగాల్, శ్రీలంక తదితర ప్రాంతాలతో పాటు మలేసియా, ఇండోనేషియా రాజ్యాలను పరిపాలించిన మహా చక్రవర్తి అని చరిత్ర చెబుతోంది. ఆయన అరియలూరు జిల్లా గంగైకొండ చోళపురంలో 1000యేళ్ల క్రితం అద్భుతంగా నిర్మించిన బృహదీశ్వరాలయాన్ని యునెస్కో సంస్థ ప్రపంచ వారసత్వ చిహ్నంగా ప్రకటించింది. దీనిపై స్పందించిన రాష్ట్రప్రభుత్వం ఈ గుర్తింపును తమిళుల ఇచ్చిన గౌరవంగా భావించి రాజేంద్రచోళుడి జయంత్యుత్సవాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఆ మేరకు గంగైకొండ చోళపురంలో ఆయన నిర్మించి బృహదీశ్వరాలయ ప్రాంగణంలో సహస్రాబ్ది వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో ప్రజలు పాల్గొనేలా అరియలూరు జిల్లాకు బుధవారం సెలవు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉదయం బృహదీశ్వరస్వామివారికి అర్చకులు పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శాస్త్రీయ, జానపద నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా చోళ చక్రవర్తుల పరిపాలనలోని ప్రధానాంశాలు, పాల్గొన్న యుద్ధాలు, సాధించిన విజయాలపై మధ్యాహ్నం చర్చా కార్యక్రమం జరిగింది. ఆ తర్వాత గరగాటం, కావడి ఆట్టం, మైలాట్టమ్, నెయ్యాండిమేళం, కోలాటం తదితర సంప్రదాయ కార్యక్రమాలు జరిగాయి. ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు, రవాణాశాఖ మంత్రి శివశంకర్, పర్యాటకశాఖ రాజేంద్రన్ సమాచారశాఖ మంత్రి స్వామినాథన్, డీపీఐ ఎంపీ తిరుమావళవన్, పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆదివారం ఈ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. అక్కడ సుమారు ఆయన మూడు గంటలు ఉండి, రాజేంద్రచోళుడి స్మారక నాణ్యాన్ని ఆవిష్కరిస్తారు. పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన, ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీత విభావరి వీక్షిస్తారు. కాగా, ఈ వేడుకల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 38 ఆధీన మఠాధిపతులు పాల్గొంటారు. అరియలూరు జిల్లాతో పాటు రాష్ట్రంలోని ప్రాంతాలలో నుంచి గంగైకొండ చోళపురానికి రాష్ట్రప్రభుత్వ రావాణా సంస్థలు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాయి.

చెన్నైలో 4 చోట్ల ఏసీ బస్‌స్టాప్‌లు

● కొళత్తూరు, రాయపురం, పెరంబూరు, వాల్‌ట్యాక్స్ రోడ్డులో ఏర్పాటు


సెయింట్ థామస్ ఏసీ బస్‌స్టాపు

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో నాలుగు చోట్ల కొత్తగా ఏసీ బస్‌స్టాపులు నిర్మించనున్నట్లు సీఎండీఏ ఉన్నతాధికారులు తెలిపారు. కొళత్తూరు, రాయపురం, పెరంబూరు, వాల్‌టాక్స్‌రోడ్డు ప్రాంతంలో ఈ ఏసీ బస్‌స్టాపులను నిర్మిస్తామన్నారు. సిటీ బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు ఎండవేడి తగలకుండా, అసౌకర్యానికి గురికాకుండా నగరంలోని కత్తిపారా జంక్షన్ సమీపం ఆలందూరు వద్ద, సెయింట్ థామస్ మౌంట్ తదితర ప్రాంతాల్లో ఏసీ బస్‌స్టాపులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రూ.8 కోట్లతో ఈ నాలుగు కొత్త బస్‌స్టాప్‌లను నిర్మించనున్నామని అధికారులు పేర్కొన్నారు. కొళత్తూరు, రాయపురం, వాల్‌టాక్స్ రోడ్డు ప్రాంతాల్లో నిర్మించనున్న ఏసీ బస్‌స్టాప్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు 78 సీట్లు ఏర్పాటు చేస్తామన్నారు. పెరంబూరు వద్ద నిర్మించే బస్‌స్టాప్‌లో 54 మంది ప్రయాణికులకు సీటింగ్ సదుపాయం కల్పించనున్నామని తెలిపారు. ఈ నాలుగు ఏసీ బస్‌స్టాప్‌ల నిర్మాణం పూర్తయిన తర్వాత నగరంలో మరికొన్ని ప్రాంతాల్లో ఏసీ బస్‌స్టాప్‌లను నిర్మిస్తామని అధికారులు వివరించారు.

బై..బై.. స్టాలిన్

● తంజావూరు ప్రచారంలో గర్జించిన ఈపీఎస్



ప్యారీస్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత నాలుగేళ్ళకు పైగా కొనసాగుతున్న ప్రజావ్యతిరేక డీఎంకే ప్రభుత్వాన్ని మరో 9 నెలల్లో ప్రజలే ఇంటికి సాగనంపుతారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తెలిపారు. వచ్చే ఏడాది అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలను పురస్కరించుకుని 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో ఈ నెల 7వ తేదీన ప్రారంభించిన తొలి ప్రచారయాత్ర బుధవారం తంజావూరు జిల్లా వరత్తనాడులో ముగిసింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈపీఎస్ ఆ ప్రాంతంలోని రైతులు, వ్యాపారులు, కులవృత్తుల సంఘాల నేతలు, కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అన్నాడీఎంకే రైతు సంఘం తరుపున కానుకగా సమర్పించిన నాగలి స్వీకరించారు. సాయంత్రం జరిగిన బహిరంగ సభలో కార్యకర్తలు బహూకరించిన టోపీ ధరించి ప్రసంగించారు. వరి సాగుకు పేరొందిన తంజా


ప్రజలకు అభివాదం చేస్తున్న ఈపీఎస్

వూరు జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఓ రైతుగా తెలుసుకున్నానని, ఉత్పత్తి అధికంగావున్న సమయంలో కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు కలిసి వరిపంటకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని, అయితే డీఎంకే ప్రభుత్వం ఈ వ్యవహారంలో కేంద్రప్రభుత్వాన్ని ఒప్పించి అన్నదాతలకు న్యాయం చేయలేక చతికిలబడిందని విమర్శించారు. వచ్చే ఏడాది అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో ప్రజల అండదండలతో అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారం చేపడుతుందని, అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. కేంద్రప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి చెందాల్సిన అభివృద్ధి పథకాల నిధులను సకాలంలో పొందడానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకాన్ని 150 రోజులుగా పొడిగిస్తామని వెలుగుల పండుగ దీపావళి సందర్భంగా గృహిణులకు చౌకదుకాణాల ద్వారా నాణ్యమైన చీర కానుకగా అందజేస్తామన్నారు. 234 నియోజకవర్గాల్లో 210 స్థానాల్లో అన్నాడీఎంకే కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఈపీఎస్ ధీమా వ్యక్తంచేశారు. దివగత మాజీముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత కన్నకలలు తప్పకుండా నెరవేరే రోజులు ముందున్నాయన్నారు. డీఎంకే కూటమిలో ఉన్న పార్టీలలో ఏకాభిప్రాయం లేనందువల్ల రాష్ట్రప్రభుత్వ పథకాల గురించి ప్రచారం చేసేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని విమర్శించారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిలో భాగస్వామ్యం వహించిన ఆమ్ ఆద్మీ పార్టీతో పాటు మరికొన్ని పార్టీలు కూటమి నుంచి బయటికొచ్చాయని, మరి కొన్ని రోజుల్లో పలు పార్టీలు కూడా వైదొలిగే పరిస్థితి కనిపిస్తుందన్నారు. దేశంలో ఏ పార్టీ కూడా ఇంటింటికీ వెళ్ళి పార్టీ సభ్యత్వం చేపట్టిన దాఖలాలు లేవని, అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతామేమోనన్న భయంతోనే డీఎంకే చట్టవిరుద్ధంగా పార్టీ సభ్యత్వం పేరుతో ఇంటింటికి వెళ్ళి ప్రజలను ఓటీపీ అడిగడంపై న్యాయస్థానం మందలించిందని ఈపీఎస్ ఎద్దేవాచేశారు.



'కరుప్పు' ఫస్ట్ లుక్ రిలీజ్

7

పిక్నిక్ స్పాట్‌గా పాడి ఫ్లై ఓవర్



విజయం తర్వాతే సంకీర్ణ ప్రభుత్వంపై నిర్ణయం



● బీజేపీ సీనియర్ నేత తమిళిసై

వేలూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల అనంతరం సంకీర్ణ ప్రభుత్వంపై అమిత్ షా, ఎడప్పాడి పళనిస్వామి కలిసి నిర్ణయం తీసుకుంటారని బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందర్‌రాజన్ తెలిపారు. స్థానికంగా ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం వచ్చిన తమిళిసై మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ నిధులు వెచ్చించి'ఉంగళుడన్ స్టాలిన్' పేరుతో డీఎంకే ఎన్నికల ప్రచారం చేపట్టిందని ఆరోపించారు. నాలుగేళ్లలో చేయని పనులు 45 రోజుల్లో చేస్తున్నట్లు ప్రచార ఆర్భాటంలో తెలుపుతున్నారన్నారు. ఉంగళుడన్ స్టాలిన్ కార్యక్రమంలో అవినీతి జరుగుతోందన్నారు. సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ప్రజల నుంచి లంచాలు ఆశిస్తున్నారని ఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గంగై కొండ చోళవందాన్ రావడం గౌరవంగా భావిస్తున్నామన్నారు ప్రధాని పర్యటన బీజేపీ శ్రేణులకు మరింత ఉత్తేజం అందిస్తుందన్నారు. సీమాన్, విజయ్ తదితరులు కూటమిలోకి రావాలని పళనిస్వామి ఆశిస్తున్నారని, బీజేపీ-అన్నాడీఎంకే కూటమిలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి తప్పకుండా విజయం సాధిస్తుందని ఆమె తెలిపారు. డీఎంకే కూటమిలో తిరుమావళవన్, కార్తీ చిదంబరం, సెల్వపెరుందగై, కమ్యూనిస్ట్ నేతలు తమకు ఎన్ని సీట్లు ఇస్తారు అని బెదిరిస్తున్నారన్నారు. గ్రూప్-4 పరీక్షల్లో అవతవకలు జరిగాయని అన్నాడీఎంకేలాగే బీజేపీ కూడా అభిప్రాయపడుతుందన్నారు. ఉప రాష్ట్రపతి రాజీనామాపై అభిప్రాయం తెలియజేయడం లేదని, రాష్ట్రానికి చెందిన వారు ఉప రాష్ట్రపతిగా రావాలని కోరుకుంటున్న తరుణంలో, ఈ రేసులో తాను లేనని తమిళిసై తెలిపారు.


సొరంగం పనులు పూర్తిచేసి వెలుపలికి వచ్చిన 'పీకాక్' యంత్రం - పర్యవేక్షిస్తున్న అధికారులు

పనగల్ పార్క్-కోడంబాక్కం
మెట్రో సొరంగం పనులు పూర్తి

● విజయవంతంగా వెలుపలికి 'పీకాక్' యంత్రం


పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ పనగల్ పార్క్ నుంచి కోడంబాక్కం వరకు రెండో విడత సొరంగం పనులు పూర్తయ్యాయని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ప్రకటన విడుదల చేసింది. నగర వ్యాప్తంగా 118.9 కి.మీ మేర మూడు మార్గాల్లో చేపడుతున్న రెండో విడత మెట్రో రైల్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌లో రెండో మార్గం లైట్ హౌస్ నుంచి కోడంబాక్కం ఫ్లై ఓవర్ వరకు 10.03 కి.మీ వరకు నాలుగు యంత్రాలతో సొరంగం మార్గం తవ్వకాలు చేపట్టారు. వాటిలో 'మయిల్' అనే యంత్రం 2024 మే 2న పనగల్ పార్క్ నుంచి సొరంగం తవ్వే పనులు ప్రారంభించి, 2,047 మీటర్ల దూరం విజయవంతంగా తవ్వకం పనులు పూర్తిచేసి, ఆర్కాడు రోడ్డులోని మీనాక్షి కళాశాల వద్దకు బుధవారం విజయవంతగా చేరుకుంది. లైట్ హౌస్ నుంచి పూందమల్లి బైపాస్ రోడ్డు వరకు 26.8 కి.మీ దూరం వరకు సొరంగ మార్గంలో 12 రైల్వేస్టేషన్లు, స్తంభాలపై 18 రైల్వేస్టేషన్లు ఏర్పాటుకానున్నాయి.

అత్యంత కఠినం... : పనగల్ పార్క్-కోడంబాక్కం మధ్య ఫేజ్-2 అతిపొడవైన సొరంగ మార్గం. ఇందులో, టన్నెల్ బోరింగ్ మెషీన్ 'పీకాక్' 190 భవనాల గుండా వెళ్లవలసి వచ్చింది. ఎక్కువగా నివాసాలు, వీటిలో 50 అత్యంత పాత భవనాలు, అనేక రైల్వే ట్రాక్‌లు దాటవలసి వచ్చింది. రైల్వే ట్రాక్‌లను దాటడానికి ముందు రైల్వే లైన్‌కు సమాంతరంగా బోర్ వేయవలసి వచ్చింది. ఈ సొరంగం రెండు చర్చిలు, కోడంబాక్కం ఫ్లై ఓవర్ కిందుగా వెళ్లింది.

రేపటి నుంచి ప్రజల్లోకి అన్బుమణి

● హక్కుల సాధన కోసం పాదయాత్ర

ప్యారీస్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తన తండ్రి, పీఎంకే అధినేత డాక్టర్ రాందాస్‌తో పదవుల పందేరంపై తీవ్ర విభేదాలు నెలకొన్న నేపథ్యంలో ఆ పార్టీ నేత డాక్టర్ అన్బుమణి ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. భారత రాజ్యాంగం కల్పించిన 10 ప్రధానమైన హక్కులను ప్రజలకు కల్పించాల్సిందేన్న డిమాండ్‌తో శుక్రవారం నుంచి నవంబర్ 1వ తేదీ వరకు పాదయాత్ర చేపట్టనున్నారు. ఆయన బుధవారం తన ప్రచారయాత్ర విశేషాలను ఎక్స్‌పేజీలో పోస్టుచేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను డీఎంకే ప్రభుత్వం అమలుపరచకుండా ప్రజలకు మొండిచెయ్యి చూపుతోందని అన్బుమణి తన ప్రకటనలో ఆరోపించారు. భారత రాజ్యాంగంలోని ఈ పది ప్రధాన హక్కులను తక్షణం రాష్ట్రప్రజలకు అందజేయాలని, వీటి ద్వారా ప్రజల జీవన విధానాన్ని మెరుగుపరచాలనే లక్ష్యంతో తన ప్రచారయాత్ర రాష్ట్రంలో సాగుతుందని తెలిపారు. చెంగల్పట్టు జిల్లా తిరుప్పోరూరులో ప్రారంభం కానున్న ఈ యాత్ర, ధర్మపురిలో ముగుస్తుందని వివరించారు. ఈ హక్కుల సాధన ప్రచార యాత్ర కోసం ప్రత్యేకంగా రూపొందించిన లోగో కూడా అన్బుమణి ఆవిష్కరించారు.



అన్బుమణి పాదయాత్ర లోగో

తూత్తుకుడి విమానాశ్రయానికి కొత్త సొబగులు

ప్యారీస్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు అధికంగా ఉన్న తూత్తుకుడిలో రూ.380 కోట్లతో అంతర్జాతీయ స్థాయి లో ఆధునికీకరించిన విమానాశ్రయం అందరినీ ఆకట్టుకుంటోంది. పాత విమానాశ్రయంలో 1,381 మీటర్ల పొడవైన రన్‌వే వుండగా, ప్రస్తుతం 3,115 మీటర్లకు విస్తరింపజేశారు. అంతేకాకుండా ఒకే సమయంలో ఐదు విమానాలను నిలిపే విధంగా వసతులు సమకూర్చారు. ఈ విమానాశ్రయం ముందు భాగంలో.. ఆంగ్లేయ పాలనలో విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమం చేపట్టిన స్వాతంత్ర సమరయోధుడు వీ.ఓ.చిదంబరం సొంతంగా నడిపిన పడవ నమూనా, ఆల్చిప్పలో ముత్యం నమూనా వుంచారు. విమానాశ్రయ ప్రాంగణంలో ప్రయాణికులకు కల్పించిన అంతర్జాతీయ వసతులను చూసేందుకు తూత్తుకుడి జిల్లావాసులే కాకుండా ఇతర జిల్లాల ప్రజలు, పర్యాటకులు పోటీ పడుతున్నారు. విమానాశ్రయానికి వెళ్ళే వారి వాహనాల పార్కింగ్ కోసం, అలాగే విమానాశ్రయంలోకి వెళ్ళేందుకు తిరిగి బయటికి వచ్చేందుకు వసతులు సమకూర్చారు. ఈ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 26వ తేదీ రాత్రి జాతికి అంకితం చేయనున్న విషయం తెలిసిందే.


ముస్తాబవుతున్న విమానాశ్రయం

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా నంగనల్లూర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. విద్యా నగర్ 1 నుంచి 3 వీధులు, ముత్యాలరెడ్డి నగర్ 1 నుంచి 3 వీధులు, గణేష్ నగర్ మెయిన్ రోడ్డు, 1,2 కస్తూర్బా వీధులు, రామకృష్ణన్ వీధి, రాధా నగర్, అన్నానగర్ మెయిన్ రోడ్డు, కనకవల్లి వీధి, ఈసీఆర్ నగర్, మండపం అవెన్యూ రోడ్డు, ఉషా నగర్ 2,3 వీధులు, బాలాజి 1,4,8, 37వ వీధులు, 3వ ఎక్స్‌టెన్షన్, సప్తగిరి వీధి, విలేజ్ రోడ్డు, గాయత్రి వీధి, గిరి వీధి తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

హౌసింగ్ బోర్డు కార్యాలయ చిరునామా మార్పు

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు హౌసింగ్ బోర్డు ప్రధాన కార్యాలయ చిరునామా మారింది. కోయంబేడు ఈ అండ్ సి మార్కెట్ రోడ్డులోని సీఎండీఏ ప్రాంగణంలో ఉన్న తమిళనాడు హౌసింగ్ బోర్డు ప్రధాన కార్యాలయం, ఇక నుంచి సీఐటీ నగర్ మెయిన్ రోడ్డులోని బోర్డు కార్యాలయంలో పనిచేస్తుందని సచివాలయం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

క్రికెట్ జట్టులో చేరేందుకు ఆహ్వానం

పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రికెట్ జట్టులో 16 ఏళ్ల క్రీడాకారుల ఎంపిక శిబిరం ఆగస్టు 1వ తేది చేపాక్కంలోని ఎంఎ చిదంబరం స్టేడియంలో జరుగనుంది. 2009 సెప్టెంబరు 1 నుంచి 2011 ఆగస్టు 31వ తేదిలోపు జన్మించిన వారు ఈ శిబిరంలో పాల్గొనవచ్చు. ఆసక్తి కలిగిన వారు www.tnca.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 28వ తేదిలోపు పేర్లు నమోదుచేసుకోవాలని తమిళనాడు క్రికెట్ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.

రామేశ్వరం విమానాశ్రయ ఏర్పాటుకు 5 స్థలాల ఎంపిక

పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా రామేశ్వరంలో విమానాశ్రయం ఏర్పాటుకు ఐదు స్థలాలు గుర్తించారు. ప్రస్తుతం రామేశ్వరం వెళ్లేందుకు రైలు, బస్సు మార్గాలుండగా, విమానాశ్రయం ఏర్పాటుచేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం, రామేశ్వరంలో విమానాశ్రయం ఏర్పాటుకు ఐదు స్థలాలు గుర్తించింది. వీటిలో మూడు స్థలాలు ఎంపిక చేసి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు పంపించనున్నారు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... రామేశ్వరంలో విమానాశ్రయం ఏర్పాటుకు 700 ఎకరాలు అవసరమని, ఒక రన్‌వే, కేటగిరి 'సి' విమానాలు నడిపే సామర్థ్యంతో కూడిన విమానాశ్రయం ఏర్పాటుకానుందని తెలిపారు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ● నెం.07191 కాచిగూడ-మదురై స్పెషల్ ఆగస్టు 18 నుంచి అక్టోబరు 10వ తేది వరకు (సోమవారం) 9 సర్వీసులు, నెం.07192 మదురై-కాచిగూడ స్పెషల్ ఆగస్టు 20 నుంచి అక్టోబరు 15వ తేది (బుధవారం) వరకు 9 సర్వీసులు పొడిగించారు. ● నెం.07193 హైదరాబాద్-కొల్లం స్పెషల్ ఆగస్టు 16 నుంచి అక్టోబరు 11 వరకు (శనివారం) 9 సర్వీసులు, నెం.,07194 కొల్లం-హైదరాబాద్ స్పెషల్ ఆగస్టు 18 నుంచి అక్టోబరు 13 వరకు (సోమవారం) 9 సర్వీసులు పొడిగించారు. ● నెం.07230 హైదరాబాద్-కన్నియాకుమారి స్పెషల్ ఆగస్టు 13 నుంచి అక్టోబరు 8వ తేది వరకు (బుధవారం) 9 సర్వీసులు, నెం.07229 కన్నియాకుమారి-హైదరాబాద్ స్పెషల్ ఆగస్టు 15 నుంచి అక్టోబరు 10వ తేది వరకు (శుక్రవారం) 9 సర్వీసులు పొడిగించారు.

పాములు పట్టేవారు మృతిచెందితే రూ.20 లక్షల పరిహారం

పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇరుళర్ పాములు పట్టే వృత్తి చేస్తూ సహకార శాఖలో సభ్యులుగా ఉన్న వారు ప్రమాదం, పాము కాటుకు గురై మృతిచెందితే రూ.20 లక్షలు పరిహారం అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో చెంగల్పట్టు, తిరువణ్ణామలై జిల్లాల్లో ఈ సంఘాలుండగా, ఈ సంఘాల్లో సభ్యులు విషపూరిత పాములను బంధించి, వాటి నుంచి విషం తీసి ఔషధ పరిశోధన కేంద్రాలు, మందుల కంపెనీలకు విక్రయిస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఈ సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారు ప్రమాదాలు, పాము కాటుకు గురై మృతిచెందితే రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షల పరిహారం అందించనుంది. అందుకోసం, రూ.1.50 కోట్ల మూలధనం కేటాయించినట్లు ప్రభుత్వం తెలిపింది.

వెటర్నరీ కోర్సులకు కౌన్సెలింగ్... 10 మందికి అడ్మిషన్ ఉత్తర్వులు

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక విశ్వవిద్యాలయంలో వెటర్నరీ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం ప్రకటించిన 7.5 శాతం రిజర్వేషన్ల ప్రకారం అర్హులైన అభ్యర్థులకు బుధవారం ఉదయం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ సందర్భంగా తొలి పది ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు అడ్మిషన్లకు సంబంధించిన ఉత్తర్వులను పశుసంవర్ధక శాఖ మంత్రి అనితా రాధాకృష్ణన్ అందజేశారు. మాధవరం డైరీ ప్రాంగణంలో బీవీఎస్సీ, ఏహెచ్ ఫైన్ ఆర్ట్స్, బిటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల అడ్మిషన్లకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యుడు మాధవరం సుదర్శనం, వైస్‌ఛాన్సలర్ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళయరాజా కేసులో సోనీ మ్యూజిక్‌ను ప్రతివాదిగా చేర్చాలి

● హైకోర్టు ఆదేశం

అడయార్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ముందస్తు అనుమతి లేకుండా 'మిసెస్ అండ్ మిస్టర్' సినిమాలో 'రాత్తిరి శివ రాత్తిరి' అనే పాట ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా దాఖలు చేసిన కేసులో ప్రముఖ ఆడియో కంపెనీ సోనీ మ్యూజిక్‌ను ప్రతివాదిగా కూడా చేర్చాలని మద్రాస్ హైకోర్టు బుధవారం ఆదేశించింది. వనితా విజయకుమార్ ప్రధాన పాత్రలో వచ్చిన ఆ చిత్రంలో ఇళయరాజా నేపథ్య సంగీతం సమకూర్చిన ఆ పాట వినియోగించారు. ఇది కాపీ రైట్ చట్ట ఉల్లంఘన కిందకు వస్తుందని, అందువల్ల ఆ చిత్రం నుంచి ఆ పాటను తొలగించేలా ఆదేశించాలని కోరుతూ ఇళయరాజా హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై బుధవారం మరోమారు విచారణ జరిగింది. ఆ సమయంలో వనిత విజయకుమార్ తరఫున హాజరైన న్యాయవాది... 'ఇళయరాజాకు చెందిన 4850 పాటలు సోనీ మ్యూజిక్ సంస్థ సొంతం చేసుకుంది. వారి నుంచే ఈ పాట తీసుకుని సినిమాలో వినియోగించడం జరిగింది' అని తెలిపారు. ఇరు తరఫు వాదనలు ఆలకించిన న్యాయమూర్తి ఈ కేసులో సోనీ మ్యూజిక్‌ను కూడా ఒక ప్రతివాదిగా చేర్చాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వచ్చే నెల 18వ తేదీకి వాయిదా వేసింది.

తంజావూరు జిల్లాలో ముమ్మరంగా వ్యవసాయపనులు

● 1.38 లక్షల ఎకరాల్లో వరి సాగు



పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లాలో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడంతో అధిక విస్తీర్ణంలో రైతులు సాగు ప్రారంభించారు. రాష్ట్రంలో ధాన్యాగారంగా తంజావూరు మండలం (తంజావూరు, నాగపట్టణం, తిరువారూరు, మైలాడుదురై) పేరుగాంచింది. ఈ జిల్లాలను కావేరి డెల్టాగా పిలుస్తుంటారు. ఈ జిల్లాల్లో కురువై, సంబా, తాళడి తదితర మూడు దశల వరి పంటను రైతులు సాగుచేస్తుంటారు. ఈ ఏడాది మేట్టూరు డ్యాం నుంచి జూన్ 12న సీఎం స్టాలిన్ సాగు నీటిని విడుదల చేశారు. ఈ నీరు కల్లనై డ్యాంకు చేరుకుని, అక్కడి నుంచి డెల్టా సాగుకు 15వ తేది నీటిని విడుదల చేశారు. కల్లనై నుంచి కావేరి, వెన్నారు. కల్లనై కాలువ, కొల్లిడం తదితర నదుల డెల్టాలోని సుమారు 13 లక్షల ఎకరాలకు సాగునీరందుతోంది. తంజావూరు జిల్లాలో ఈ ఏడాది 1.96 లక్షల ఎకరాల్లో కురువై సాగు చేపట్టాలని నిర్ణయించిన వ్యవసాయ శాఖ అధికారులు, దానికి అవసరమైన వరి నారు, ఎరువులు తదితరాలు సిద్ధం చేశారు. ప్రస్తుతం జిల్లాలో 1.38 లక్షల ఎకరాల్లో కురువై సాగు చేపట్టినట్లు, ఈ నెలాఖరులోపు నిర్దేశిత లక్ష్యం అధిగమించే అవకాశముందని అధికారులు తెలిపారు.

తూత్తుకుడి స్టెరిలైట్‌కు మద్దతుగా ఆందోళన

● వెయ్యి మందిపై కేసు నమోదు

పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్టెరిలైట్ కర్మాగారం మళ్లీ ప్రారంభించాలంటూ మంగళవారం తూత్తుకుడి జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని తూత్తుకుడి-తిరునల్వేలి రోడ్డుపై పలువురు రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళలో స్టెరిలైట్ అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలు సుమారు 1,000 మంది పాల్గొన్నారు. అలాగే, పలువురు వాహన చోదకులు తమ వాహనాలను రోడ్డుపై నిలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ క్రమంలో, ఆందోళనలో పాల్గొన్న ఐదుగురు స్టెరిలైట్ అధికారులు, ముగ్గురు న్యాయవాదులు, 53 మంది వ్యాన్ డ్రైవర్లు, 20 మంది ఆటో డ్రైవర్లు, మహిళా బృందాల నాయకులు, జాలర్ల సంఘాలు, కర్మాగారం మద్దతుదారులు సహా 1,000 మందిపై పోలీసులు రెండు సెక్షన్ల కింద కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

ఆరు నెలల్లో 2లక్షల మెట్రిక్ టన్నుల భవన వ్యర్థాల తొలగింపు

ప్యారీస్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో గడిచిన ఆరు నెలల్లో సుమారు 2లక్షల మెట్రిక్ టన్నుల భవన వ్యర్థాల తొలగించినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. తండయార్‌పేట, రాయపురం, తిరువీకానగర్, అన్నానగర్, తేనాంపేట, కోడంబాక్కం, అడయార్, తిరువొత్తియూర్, మాధవరం, అంబత్తూరు, వలసరవాక్కం, పెరుంగుడి, షోళింగనల్లూరు తదితర 15 జోన్లలో భవన వ్యర్థాల తొలగింపు పనులను జీసీసీ ముమ్మరం చేసింది. మొత్తం 168 లారీల ద్వారా రోజుకు వెయ్యి మెట్రిక్ టన్నుల నిర్మాణ వ్యర్థాలను తొలగించారు. రహదారులు, నివాస ప్రాంతాలు, వాణిజ్య ప్రాంతాల్లో అనుమతిలేకుండా కట్టడ వ్యర్థాలు పడేసిన వారినుంచి గత ఆరు నెలల్లో జరిమానాగా రూ.39.30 లక్షలు వసూలు చేసినట్లు జీసీసీ తెలిపింది.

ఎగ్మూర్ స్టేషన్‌లో గంజాయితో యువకుడి అరెస్టు

ప్యారీస్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌కు రైలులో అక్రమంగా గంజాయి తరలించిన యువకుడిని అరెస్టు చేసిన పోలీసులు అతడి నుంచి 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌కు వచ్చిన పలు రైళ్లలో వచ్చిన ప్రయాణికుల లగేజీని ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీ చేశారు. 7వ నెంబరు ప్లాట్‌ఫామ్‌లో అనుమానస్పదంగా కనిపించిన ఓ యువకుడిని ప్రశ్నించగా అతడు పొంతనలేకుండా సమాధానం చెప్పినట్లు తెలిసింది. దీంతో అతడి బ్యాగును తనిఖీ చేసిన పోలీసులు 2 కిలోల బరువైన 10 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.10లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. విచారణలో పట్టుబడ్డ వ్యక్తి త్రిపురకు చెందిన సాహిమియా (28)అని తెలిసింది. అతను హౌరా నుంచి ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి తరలించినందున తదుపరి చర్యల కోసం అన్నానగర్ ఎక్సైజ్ విభాగం పోలీసులకు అప్పగించినట్లు రైల్వేపోలీసులు తెలిపారు.

లారీ డ్రైవర్ కళ్లలో కారం చల్లి రూ.10 లక్షల చోరీ

ప్యారీస్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి లోడుతో విక్రవాండికి చేరుకున్న లారీ డ్రైవర్ కళ్ళలో కారం చల్లి రూ.10 లక్షల నగదు దోచుకున్న సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు. మాధవరంలో కోడిగుడ్ల హోల్‌సేల్ వ్యాపారం చేస్తున్న సెల్వరాజ్ నామక్కల్‌లోని కోళ్ళ ఫారం నుంచి గుడ్లు కొనుగోలు చేస్తుంటారు. ఈ విధంగానే గుడ్ల కొనుగోలు కోసం తమ లారీ డ్రైవర్ సప్తగిరికి రూ.10 లక్షల ఇచ్చి పంపారు. మంగళవారం రాత్రి 9 గంటలకు నగరం నుంచి బయలుదేరిన లారీ అర్థరాత్రి 12.10 గంటల సమయంలో విక్రవాండి చేరుకుంది. సప్తగిరి లారీని కూట్టేరిపట్టి ప్రాంతంలో పార్కింగ్ చేసి నిద్రపోయాడు. బుధవారం తెల్లవారుజామున 3.30 గంటలకు సప్తగిరి లారీని విక్రవాండి టోల్‌గేట్ సమీపంలో నిలుపగా, కారులో వెళ్లిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అతడి కళ్ళలో కారం కొట్టి నగదుతో పారిపోయారు. దీనిపై అందజేసిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి పరారైన దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

మదురై ఆధీనం ముందస్తు బెయిలు రద్దు చేయాలంటూ పిటిషన్


పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మదురై ఆధీనంకు మంజూరుజేసిన ముందస్తు బెయిలు రద్దు చేయాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పోలీసు శాఖ తరఫున పిటిషన్ దాఖలైంది. మే 2వ తేది మదురై ఆధీనం కారు కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేట సమీపంలో ప్రమాదానికి గురైంది. ఒక మతం వారు తనను హత్యచేసేందుకు యత్నిస్తున్నారని మదురై ఆధీనం చేసిన ఆరోపణలు చర్చనీయాంశమయ్యాయి. మదురై ఆధీనం వ్యాఖ్యలు ఇరుమతాలను రెచ్చగొట్టేవిధంగా ఉన్నాయంటూ నగరానికి చెందిన న్యాయవాది రాజేంద్రన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై మదురై ఆధీనంపై నాలుగు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో, విచారణకు హాజరుకావాలని చెన్నై సైబర్ క్రైం పోలీసులు సమన్లు పంపినా మదురై ఆధీనం హాజరుకాలేదు.అనంతరం చెన్నైప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు మదురై ఆధీనంకు ముందస్తు బెయిలు మంజూరు చేసింది.ఈ క్రమంలో, గత ఆదివారం ఈకేసుకు సంబంధించి మదురై మీనాక్షి అమ్మవారి ఆలయ సమీపంలోని మఠంలో మదురై ఆధీనంను సైబర్ క్రైం పోలీసులు విచారించారు. తాజాగా, మదురై ఆధీనం విచారణకు సహకరించలేదని, ఆయన ముందస్తు బెయిలు రద్దు చేయాలని కోరుతూ చెన్నై సైబర్ క్రైం పోలీసులు మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు.

అన్నాడీఎంకే మెజార్టీ సాధించినా... సంకీర్ణ ప్రభుత్వమే...!

● టీటీవీ దినకరన్

పెరంబూర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో అన్నాడీఎంకే మెజార్టీ సాధించినా, సంకీర్ణ ప్రభుత్వమే ఏర్పాటవుతుందని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే)అధ్యక్షుడు టీటీవీ దినకరన్ స్పష్టం చేశారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ... 2026 శాసనసభ ఎన్నికల్లో డీఎంకేను ఓడించేందుకు ఏఎంఎంకే ఆధ్వర్యంలో ప్రచారం చేపడుతున్నామన్నారు. 2026 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించిప్రభుత్వం ఏర్పాటుచేస్తుందని, అందులో కూటమిపార్టీలకు భాగస్వామ్యం కల్పించి మంత్రివర్గంలో స్థానం కల్పించనున్నారని తెలిపారు. కేంద్రంలో బీజేపీకి పూర్తి మెజార్టీ ఉన్నా, కూటమి పార్టీలకు మంత్రివర్గంలో చోటు కల్పించారని, ఆ ప్రకారం, రాష్ట్రంలో అన్నాడీఎంకే మెజార్టీ సాధించినా సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటవుతుందన్నారు. డీఎంకే గద్దెదింపేలా కూటమికిబలోపేతం చేయాలని కేంద్రమంత్రి అమిత్‌షా పదేపదేచెబుతున్నారని, సీఎం ఎవరనే విషయం అమిత్ షాను అడిగితే బాగుంటుందని దినకరన్ తెలిపారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల నిరసన



నల్ల బాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని చెత్త సేకరణ, ఇతర పనులు ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ జీసీసీ 'సెంగొడి సంఘం'-సీఐటీయూ ఆధ్వర్యంలో జీసీసీ మండల కార్యాలయాల ఎదుట బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు నల్ల బాడ్జీలు ధరించి మానవహారంగా ఏర్పడి, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ... చెన్నై కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే పలు మండలాల్లో పారిశుధ్య పనులు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారన్నారను. మిగిలిన మండలాల్లో కూడా ఒక్కో విభాగంగా ప్రైవేటీకరణ సాగుతోందని ఆరోపించారు. నగర స్వచ్ఛతకు, ప్రజల ఆరోగ్యం కాపాడే విధంగా పారిశుధ్య కార్మికులు రేయింబవళ్లు శ్రమిస్తున్నారని, తాజా ప్రైవేటీకరణతో వందలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రైవేటీకరణ మానుకుని, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.

డీఎంకేకు మద్దతుగా యువత నిలవాలి

జిల్లా నిర్వాహకుడు మురళీసేన



కళాశాల విద్యార్థులకు కరపత్రాలు ఇస్తున్న డీఎంకే శ్రేణులు

తిరుత్తణి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థులకు డీఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిపాలిటీ పరిధిలోని కళాశాల విద్యార్థులకు నాలుగేళ్ళుగా ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం సాధించిన విజయాలు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలతో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంకే జిల్లా నాయకుడు మురళీసేన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే డీఎంకే ప్రభుత్వ లక్ష్యమని, యువత డీఎంకేకు మద్దతుగా నిలిచి మళ్ళీ స్టాలిన్ ప్రభుత్వాన్ని గెలిపించాలని యువతకు పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో డీఎంకే విద్యార్థి విభాగం జిల్లా డిప్యూటీ కో-ఆర్డినేటర్ వేలరసన్, జిల్లా విద్యార్థివిభాగం నిర్వాహకులు గోపీనాథ్, అరుణ్, భరత్ అన్బు, సుధాకర్, వేలుమలై మురుగన్, విఘ్నేష్‌రాజ్‌కుమార్, గుణశేఖరన్, సంతోష్, శివకుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5.9 కోట్లకు ఆస్తి పత్రాలు సమర్పించండి

● రవి మోహన్‌కు హైకోర్టు ఆదేశం

అడయార్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొత్త సినిమాలో నటించేందుకు తీసుకున్న అడ్వాన్స్ తిరిగి చెల్లించని వ్యవహారంలో హీరో రవి మోహన్ రూ.5.90 కోట్ల ఆస్తికి సంబంధించిన పత్రాలను సమర్పించాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. కొత్త చిత్రం కోసం రవి మోహన్‌కు బాబీ టచ్ యూనివర్స్ అనే నిర్మాణ సంస్థ అడ్వాన్స్‌గా సొమ్ము చెల్లించింది. ఈ మూవీ కోసం రవి మోహన్ 80 రోజుల క్యాల్షీట్లు కేటాయించారు. అయితే, అనుకున్న సమయంలో చిత్ర నిర్మాణాన్ని ప్రారంభించలేదు. దీంతో తీసుకున్న అడ్వాన్స్‌ను రవి మోహన్ చెల్లించాలని నిర్మాణ సంస్థ కోరింది. కానీ, నిర్మాణ సంస్థే తనకు రూ.9 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ హైకోర్టులో రవి మోహన్ పిటిషన్ వేశారు. మరోవైపు, తీసుకున్న అడ్వాన్స్ సొమ్ము తిరిగి చెల్లించేలా ఆదేశించాలని కోరుతూ నిర్మాణ సంస్థ కూడా హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఆ సమయంలో న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. 'అడ్వాన్స్‌గా తీసుకున్న సొమ్మును తిరిగి చెల్లించడంలో కష్టమేమి? ఈ అంశంలో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం వల్ల ప్రచారం మినహా ఏం లాభం' అంటూ ప్రశ్నించారు. అదేసమయంలో రవి మోహన్ రూ.5.90 కోట్లకు సంబంధించి ఆస్తి పత్రాలను 4 వారాల్లో సమర్పించాలని, ఈ సమస్య పరిష్కారం కోసం మధ్యవర్తిని నియమించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

కూలిన చెట్టును తొలగించని అధికారులు

● ఈ సేవా కేంద్రం వద్ద ప్రజల ఇబ్బందులు



పురుషవాక్కం ఈ-సేవా కేంద్రం వద్ద కూలిన చెట్టుకొమ్మలు దాటి వెళుతున్న మహిళలు

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురుషవాక్కం తాలూకా కార్యాలయం వద్ద కూలిన చెట్టును అధికారులు తొలగించకపోవడంతో అక్కడ ఉన్న ఈ-సేవా కేంద్రం, ఆధార్ కేంద్రానికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజుల క్రితం ఆ ఈ-సేవా కేంద్రం ముందున్న చెట్టు పెనుగాలులకు కూలిపడింది. దీంతో ఆ కేంద్రాల వద్దకు వెళ్లే ప్రజలు కూలిన చెట్టుకొమ్మలు దాటుకుంటూ వెళ్ళి తమ దరఖాస్తులను అందజేయడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై ఈ- సేవా కేంద్రం అధికారులు మాట్లాడుతూ చెట్టు కూలిన సంగతి రెవెన్యూ అధికారులకు తెలిపామని రెండు రోజులు గడిచినా ఆ చెట్టు కొమ్మలను తొలగించలేదని ఆరోపించారు. ఇకనైనా రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులకు కూలిన చెట్టు కొమ్మలను పూర్తిగా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటిలోకి దూసుకెళ్ళిన బస్సు

● బాలిక దుర్మరణం



చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా ఉళవన్ కొట్టాయ్ ప్రాంతం వద్ద అదుపు తప్పిన రాష్ట్ర రవాణా సంస్థ బస్సు రోడ్డు పక్కనే ఉన్న ఇంటిలోకి దూసుకెళ్ళింది. ఈ ప్రమాదంలో ఓ బాలిక మృతి చెందింది ఆ బస్సు స్టీరింగ్ విరిగిపోవడంతో అదుపుతప్పి ఆ ఇంటి ముంగిట ఆటలాడుతున్న అద్విక అనే బాలికపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆ బాలిక అక్కడిక్కడే మృతి చెందింది. బస్సు డ్రైవర్ దేవరాజ్ కూడా ఈ ప్రమాదంలో తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

కచ్చాదీవి ఒప్పందాన్ని వెనక్కి తీసుకోవాలి

● రాజ్యసభ సభ్యుడు వైగో

పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కచ్చాదీవిని శ్రీలంకకు కేటాయిస్తూ చేసుకున్న ఒప్పందాన్ని పునఃపరిశీలించి వెనక్కి తీసుకోవాలని ఎండీఎంకే రాజ్యసభ ఎంపీ వైగో డిమాండ్ చేశారు. పార్లమెంటు సమావేశాల్లో బుధవారం ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ... తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులు కొనసాగుతున్నాయన్నారు.ఈ ఏడాది ఇప్పటివరకు 150 మంది జాలర్లను అరెస్ట్ చేసి జైళ్లకు తరలించడంతో పాటు వారి పడవలు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలు విడిపించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వైగో డిమాండ్ చేశారు.

మైలాడుదురై ఎక్సైజ్ డీఎస్పీకి అస్వస్థత

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారులపై ఆరోపణ చేసి సస్పెన్షన్‌కు గురైన మైలాడుదురై ఎక్సైజ్ డీఎస్పీ సుందరేశ్ హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. దీంతో, ఆయనను రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు.

మాజీ మంత్రిని పొగిడిన హెచ్‌ఎం బదిలీ

పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రిని పొగిడిన ప్రధానోపాధ్యాయుడిపై బదిలీ వేటు పడింది.. ఈరోడ్ జిల్లా నంబియూర్ ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఆనందరాజ్ పనిచేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం పాఠశాలలో ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన అదనపు గదుల ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేఏ సెంగోట్టయన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హెచ్‌ఎం ఆనందరాజ్... సెంగోట్టయన్ 40 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నారని, ఆయన సాటి మరెవరూ లేరని అభినందించారు. అలాగే, కార్యక్రమంలో మతపరమైన పాటలు పాడుతూ, విద్యార్థులతో కూడా పాడించారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వెలువడ్డాయి. ఈ వ్యవహారంపై ఈరోడ్ జిల్లా ప్రధాన విద్యాధికారి సుబ్బారావు నేతృత్వంలో అధికారులు పాఠశాలకు వెళ్లి విచారణ జరిపారు. అనంతరం హెచ్‌ఎం ఆనందరాజ్‌ను తొట్టంపాలళయం ప్రభుత్వ మహోన్నత పాఠశాలకు బదిలీ చేస్తూ జిల్లా ప్రధాన విద్యాధికారి ఉత్తర్వులు జారీచేశారు.

సీఎం ఆరోగ్యంపై వదంతులు సృష్టిస్తే కఠినచర్యలు

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం వాకింగ్‌కు వెళ్తున్న సమయంలో స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారు. సీఎంను గ్రీమ్స్ రోడ్డులోని అపోలో ఆస్పత్రికి తరలించి, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. మూడు రోజులు ఆస్పత్రిలో విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఆరోగ్య పరిస్థితులపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు, వదంతులు సృష్టించే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించిన ఆరోగ్యశాఖ, ఆసుపత్రి విడుదల చేస్తున్న బులెటిన్ మాత్రమే వాస్తవమని సూచించింది.

తిరువణ్ణామలైలో నేపాల్ మహిళకు వేధింపులు

పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో నేపాల్ మహిళను వేధించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రం తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయానికి ప్రతిరోజు దేశ, విదేశాలకు చెందిన భక్తులు వస్తుంటారు. అలాగే పౌర్ణమి రోజు గిరి ప్రదక్షిణ కోసం లక్షలాది మంది వస్తుంటారు. ఈ క్రమంలో, కొద్దిరోజుల క్రితం గిరి ప్రదక్షిణ చేస్తున్న నేపాల్ దేశానికి చెందిన మహిళ, సెంగం రోడ్డు ప్రాంతంలో ఉన్న ఓ పూల దుకాణానికి వెళ్లగా, అక్కడున్న వ్యక్తి ఆమెను వేధించినట్లు తెలిసింది. అనంతరం బాధిత మహిళ ఈ విషయంపై నేపాల్ దౌత్యకార్యాలయంలో ఫిర్యాదు చేసింది. దౌత్య కార్యాలయం నుంచి అందిన ఫిర్యాదుతో జిల్లా ఎస్పీ సుధాకర్ ఆదేశాలతో తిరువణ్ణామలై టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టి, నేపాల్ మహిళను వేధించిన తిరువణ్ణామలైకు చెందిన సెట్టు (40)ను అరెస్ట్ చేశారు.

లైంగిక వేధింపుల కేసులో వృద్ధుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వృద్ధుడికి 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. కన్నియాకుమారి జిల్లా ముకిలన్‌విలై ప్రాంతానికి చెందిన నటరాజన్ (61) 2017లో ఐదేళ్ల బాలికను లైంగిక వేధింపులకు గురిచేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై బాలిక తల్లిదండ్రులు ఈత్తామొళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు నటరాజన్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో వాదనలు పూర్తవడంతో నిందితుడు నటరాజన్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ నాగర్‌కోయిల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి సుందరయ్య తీర్పు వెలువరించారు.

అదుపుతప్పిన లారీ

బస్సును ఢీకొట్టి ఏటీఎంను ధ్వంసం చేసి....

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుడువాంజేరిలో అదుపుతప్పిన ఓ లారీ ఎంటీసీ బస్సును ఢీకొట్టి, రోడ్డు పక్కన ఉన్న వ్యక్తిని ఢీకొని, సమీపంలోని ఏటీఎం కేంద్రంలోకి దూసుకెళ్లింది. బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో డీఎంకే వార్డు కార్యదర్శి మృతిచెందగా, బస్సు డ్రైవర్, కండక్టర్ సహా ఏడుగురు గాయపడ్డారు. చెంగల్పట్టు జిల్లా నందివరం-గుడువాంజేరి మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు ఎస్టేట్ కాలనీకి చెందిన రాంప్రసాద్, 24వ వార్డు డీఎంకే కార్యదర్శిగా, అరిమా సంఘం తాలూకా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. బుధవారం ఆరణిలో జరుగనున్న అరిమా సంఘం సమావేశంలో పాల్గొనేందుకు ఇంటి నుంచి బయల్దేరిన ఆయన శ్రీనివాసపురం జీఎస్‌టీ రోడ్డు పక్కన నిలబడి సమావేశంలో పాల్గొనే సభ్యులకు ఫోన్ చేస్తున్నాడు.. ఆ సమయంలో చెంగల్పట్టు నుంచి తాంబరం వైపు ఎంశాండ్ లోడుతో వెళ్తున్న లారీ, శ్రీనివాసపురం నుంచి టర్నింగ్ తీసుకుంటున్న ఎంటీసీ బస్సును ఢీకొంది. అదే వేగంతో రోడ్డుపై నిలబడిన రాంప్రసాద్‌ను ఢీకొట్టి, అదే వేగంతో రోడ్డు పక్కనున్న ఏటీఎంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో తీవ్రగాయాలతో రాంప్రసాద్ ఘటనా స్థలంలోనే మృతిచెందగా, ఎంటీసీ డ్రైవర్ వేలు, కండక్టర్ షణ్ముగం సహా ఏడుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్న తాంబరం ట్రాఫిక్ పోలీసులు, క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి పరారీలో ఉన్న లారీ డ్రైవర్ సెంథిల్ కోసం గాలిస్తున్నారు.

ఉళుందూరుపేట డిపోలో బస్సు దగ్ధం



బస్సులోని మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక దళం సభ్యులు

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కళ్లకురిచ్చి జిల్లా ఉళుందూరుపేట రాష్ట్ర రవాణా సంస్థ బస్ డిపోలో సంభవించిన అగ్ని ప్రమాదంలో ఓ బస్సు దగ్ధమైంది. బుధవారం ఉదయం ఆ డిపో నుండి కడలూరుకు బయలుదేరాల్సిన బస్సు ఇంజన్‌లో ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. క్షణాలలో మంటలు వ్యాపించాయి. డిపో అధికారులు వెంటనే అగ్ని మాపక దళానికి ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఉలుందూరుపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

ఏడేళ్ళ కుమార్తె హత్య

● తండ్రి ఆత్మహత్యాయత్నం

ప్యారీస్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలందూరులోని ఓ స్టార్ హోటల్‌లో బసచేసిన ఓ వ్యాపారి భార్యపై కోపంతో తన ఏడేళ్ళ కుమార్తెని హతమార్చి తాను ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనపై విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆలందూరు ఎంకే రోడ్డులోఉన్న స్టార్ హోటల్‌లో బసచేసిన అయినావరంకు చెందిన సతీష్ (38) తన భార్యతో ఏర్పడిన వివాదం కారణంగా మనస్తాపానికి గురైనట్లు తెలిసింది. ఆయన తన ఏడేళ్ళ కుమార్తె స్టైఫీ క్రూస్‌ను గొంతుకోసి హతమార్చి తాను కూడా ఆత్మహత్యాయత్నం చేసి స్పృహ కోల్పోయాడు.ఈఘటనపై హోటల్ మేనేజర్ అందజేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం సాయంత్రం సెయింట్ థామస్ మౌంట్ పోలీసులు హోటల్‌కువెళ్లి సతీష్‌ను రాయపేటఆస్పత్రికి తరలించారు.ఈనేపథ్యంలో ఆలందూరు మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి దీపికా హేమచంద్ బుధవారం ఈ కేసుపై విచారణ జరిపి కుమార్తెను హతమార్చిన సతీష్‌కు ఆగస్టు 6వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. దీనితో పోలీసులు రాయపేటఆస్పత్రిలో చికిత్సపొందుతున్న సతీష్‌ను అరెస్టుచేసి జైలుకు తరలించారు.

3 రోజుల్లోనే ఆ చిత్రం బడ్జెట్‌ను అధిగమించింది

● థమన్ ఆకాష్



'జన్మ నచ్చత్తిరం' సక్సెస్ మీట్‌లో పాల్గొన్న చిత్ర బృందం

తాను నటించిన 'ఒరు నొడి' చిత్ర బడ్జెట్‌ను 'జన్మ నచ్చత్తిరం' సినిమా కలెక్షన్లు కేవలం మూడు రోజుల్లోనే అధిగమించాయని హీరో థమన్ ఆకాష్ అన్నారు. అమోఘం స్టూడియోస్, వైల్ లాంప్ పిక్చర్స్ పతాకంపై కె.సుభాషిణి సమర్పణలో పి.మణివర్మన్ దర్శకత్వంలో థమన్ ఆకాష్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'జన్మ నచ్చత్తిరం' ఈ నెల 18వ తేదీ విడుదలై విజయం సాధించింది. దీంతో చిత్ర బృందం నగరంలో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఇందులో హీరో థమన్ మాట్లాడుతూ, "ఒరునొడి' మూవీ బడ్జెట్‌ను ఈ చిత్రం కేవలం మూడు రోజుల్లోనే వసూలు చేసింది. దీనికి కారణం ఈ చిత్రాన్ని పంపిణీ చేసిన రోమియో పిక్చర్స్ అధినేత రాహుల్. మా సినిమాకు ఆయన ఎంతో అండగా నిలిచారు. మార్కెటింగ్ అద్భుతంగా చేశారు. సినిమా విడుదలకు ముందు ఏ ఒక్కరూ సరిగా నిద్రపోలేదు. ఇపుడు హాయిగా ఉంది. ఆరంభంలో 150 థియేటర్లలో విడుదల చేయగా, ఇపుడు ఈ సంఖ్యను 250కు పెంచారు. ఈ చిత్రం విజయంతో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు మణివర్మన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా మల్టీప్లెక్స్‌ల్లో కంటే సింగిల్ స్ర్కీన్లలో బాగా కలెక్షన్లు వసూలు చేస్తోంది. థియేటర్లలో ప్రేక్షకుల స్పందన స్వయంగా చూడటం చాలా సంతోషంగా ఉంది. ఈ అవకాశం ఇచ్చిన అమోఘం స్టూడియో సుభాషిణి, విజయ్‌లకు ధన్యవాదాలు' తెలిపారు. ఈ కార్యక్రమంలో నటులు యాసర్, అరుణ్ కార్తీక్, మునీష్కాంత్, కేబుల్ శంకర్, మైత్రేయన్, నటి మాల్వి మల్హోత్రా, రక్షా షెరిన్, ఎడిటర్ గురు, సినిమాటోగ్రాఫర్ కేజీ, సంగీత దర్శకుడు సంజయ్ మాణిక్యం, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఆడిటర్ విజయన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి



'కరుప్పు'లో సూర్య

'కరుప్పు' ఫస్ట్ లుక్ రిలీజ్

● 'టీజర్' కూడా...

సూర్య హీరోగా ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో రూపొందుతోన్న 'కరుప్పు' చిత్రం ఫస్ట్‌లుక్‌తో పాటు టీజర్‌ను సూర్య పుట్టిన రోజు సందర్భంగా మేకర్స్ బుధవారం రిలీజ్ చేశారు. రేడియో జాకీ, నటుడు, దర్శకుడు, కథారచయిత, క్రికెట్ కామెంటేటర్ ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఆర్జే బాలాజీ అగ్రహీరో సూర్య చిత్రానికి తొలిసారి దర్శకత్వం వహించారు.. ఇది సూర్య నటించే 45వ చిత్రం కాగా, జూన్ నెలలో ఈ సినిమా టైటిల్ ప్రకటించారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుటోంది. ఈ నేపథ్యంలో సూర్య 50వ బర్త్‌డే గిఫ్ట్‌గా మూవీ ఫస్ట్‌లుక్, టీజర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో హీరో సూర్య మాస్ లుక్‌లో కనిపిస్తుండటంతో ఆయన ఫ్యాన్స్ తెగ సంతోషపడుతున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

దశాబ్దం తర్వాత అబ్బాస్ రీఎంట్రీ

● జీవీ ప్రకాష్ హీరోగా కొత్త చిత్రం



కొత్త చిత్రం పూజా కార్యక్రమం

ఒకపుడు పాపులర్ హీరోగా గుర్తింపు పొందిన అబ్బాస్ పదేళ్ళ తర్వాత కోలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటించే కొత్త చిత్రంలో అబ్బాస్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ చిత్రం షూటింగ్ సంప్రదాయ పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. దర్శకుడు ప్రదీప్ రంగనాథన్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన మరియ రాజా ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. బియాండ్ పిక్చర్స్ పతాకంపై జయవర్ధనన్ నిర్మిస్తున్నారు. శ్రీ గౌరి ప్రియ హీరోయిన్. హాస్యం, కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కిస్తున్నామని, 1990 - 2000 మధ్య కాలంలో పాపులర్‌గా హీరోగా గుర్తింపు పొందిన అబ్బాస్ ఈ చిత్రంలో ముఖ్య పాత్రను పోషిస్తున్నారని దర్శకనిర్మాతలు వెల్లడించారు.

ఆ నమ్మకంతోనే అంగీకరించా

● తేజు అశ్విని



అతి కొద్ది మంది దర్శకులు మాత్రమే తమ చిత్రాల్లో హీరోయిన్లకు బలమైన పాత్రలు ఇస్తారని అలాంటి వారిలో దర్శకుడు ము.మారన్ ఒకరని యువ హీరోయిన్ తేజు అశ్విని అన్నారు. ఆమె తాజాగా నటించిన చిత్రం 'బ్లాక్‌మెయిల్'. ఇందులో తన పాత్ర గురించి ఆమె వివరిస్తూ, 'సహజ నటనకు భిన్నంగా, పలు సన్నివేశాలు నాకు పరీక్షలా ఉన్నాయి. ఈ మూవీలో నటించడం ద్వారా సరికొత్త అనుభవాన్ని పొందాను. దర్శకుడు ము.మారన్ గత చిత్రాల్లో హీరోయిన్ పాత్ర ఎంతో బలంగా ఉంటుంది. సాధారణంగా అతికొద్ది మంది దర్శకులు తమ చిత్రాల్లో హీరోయిన్లకు బలమైన పాత్రలు ఇస్తారు. ఇలాంటి వారిలో ము.మారన్ ఒకరు. ఖచ్చితంగా ఈ చిత్రం నాకు మంచి బ్రేక్ వస్తుందని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు.

కన్నియాకుమారిలో కడలి కోత

● ఎగసిపడుతున్న అలలు



కన్నియాకుమారి నీరోడి తీరం వైపు ఎగసిపడుతున్న అలలు

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలోని కన్నియాకుమారి నుండి నీరోడి వరకు 42 మత్స్యకారుల గ్రామాల్లో బుధవారం ఉదయం నుండి సముద్రతీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. ఈ తీరంలో ఆణి, ఆడి మాసాల్లో వచ్చే అమావాస్య సందర్భంగా సముద్రంలో ఆటుపోట్లు పెరిగి తీరం పొడవునా అలలు ఎగసిపడుతుంటాయి. ఆ ప్రకారం బుధవారం ఉదయం ఈ తీరం పొడవునా మత్స్యకారుల ఇళ్ళ వైపు అలలు వచ్చాయి. కొన్నిళ్లలోకి సముద్ర జలాలు చొరబడ్డాయి. దీనితో మత్స్యకారుల కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. రాజాంగమంగళం వద్ద 3 మీటర్ల ఎత్తున అలలు జనవాస ప్రాంతాల వైపు ఎగసిపడ్డాయి.

కాళికాంబాల్ ఆలయంలో సూర్య దంపతుల పూజలు



అడయార్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు సూర్య, ఆయన సతీమణి, సినీ నటి జ్యోతిక దంపతులు ప్యారీస్‌లోని కాళికాంబాల్ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. సూర్య 50వ పుట్టిన రోజు సందర్భంగా సూర్య దంపతులు ఆలయానికి వెళ్ళగా, ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, దర్శనం చేసుకున్నారు. వేదపండితులు వారికి వేదాశీర్వాదం చేశారు. సాధారణంగా ప్రతి యేటా తన పుట్టిన రోజున సూర్య ఈ ఆలయానికి వెళ్ళి అమ్మవారిని దర్శనం చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మరోవైపు, తమ అభిమాన హీరో పుట్టిన రోజును పురస్కరించుకుని సూర్య అభిమానులు రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపించారు. పేదలకు సంక్షేమ సహాయాలను, పలు ఆస్పత్రుల్లో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు.

9న రేడియంట్ వెల్నెస్ సదస్సు



డాక్టర్ రేణుకా డేవిడ్

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రేడియంట్ వెల్నెస్ సంస్థ ఆధ్వర్యంలో ఆగస్టు 9న ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సదస్సు నిర్వాహకురాలు డాక్టర్ రేణుకా డేవిడ్ తెలిపారు. నగరంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ సదస్సు శారీరక, మేథో, సామాజిక సాంకేతిక, ఆర్థిక, పర్యావరణ, భావోద్వేగ, వృత్తి, ఆరోగ్య పరమైన అంశాలపై ప్రత్యేక దృష్టిని సారిస్తుందన్నారు. ఈ సదస్సులో సాంకేతిక ఆరోగ్య, పర్యావరణ రంగాల్లో విశిష్టమైన సేవలందించిన ప్రముఖులకు అవార్డులు, జీవనసాఫల్య పురస్కారాలు కూడా అందిస్తామని చెప్పారు.

'లగ్జరీ అఫైర్ వెడ్డింగ్ - లైఫ్‌స్టైల్ ఎక్స్‌పో' ప్రారంభం



ఎక్స్ పో ప్రారంభోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

అడయార్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ నక్షత్ర హోటల్‌లో 'ది లగ్జరీ అఫైర్ వెడ్డింగ్ అండ్ లైఫ్ స్టైల్ ఎక్స్‌పో 17వ ఎడిషన్ బుధవారం జరిగింది. ఆర్గనైజర్ జో మైఖేల్ ప్రవీణ్ నిర్వహించిన ఈ వివాహ, జీవనశైలి ప్రదర్శనలో అగ్రశ్రేణి లగ్జరీ బ్రాండ్లు ఒకే దగ్గర ఏర్పాటు చేశాయి. ఇందులో డిజైనర్ దుస్తులు మొదలుకుని, సౌందర్య సాధనాలు, వెల్నెస్, ఎలైట్ వివాహ ప్రణాళిక సేవలు అందుబాటులో ఉంచారు. 'ది ఎవ్రీథింగ్ ఆఫ్ వెడ్డింగ్స్' అనే థీమ్‌తో జరిగిన ఈ ప్రదర్శనను బిగ్‌బాస్ తమిళ ఫేమ్ అమీర్, పావని ఈ ఎక్స్‌పో ప్రారంభించగా, నగరానికి చెందిన పలువురు అతిథులు పాల్గొన్నారు. ఇందులోపాల్గొన్న ప్రధాన బ్రాండ్లలో ఆడి, మెర్సిడెజ్, జువెల్హా, అన్లాన్, చెన్నై డైమండ్స్, నవీన్ బిల్డర్, విల్వా జ్యువెలరీ, పర్పుల్ ట్రీ, ఇంప్రెస్ స్టీల్స్, క్లిక్ ఫ్యాక్టరీ ఫొటోగ్రఫీ, ఎలైట్ మ్యాట్రిమోనీ, హయత్ రీజెన్సీ, వివాహ స్కిల్, కేక్ స్క్వేర్, ఈసీఆర్, ఈక్విటీస్, బిల్‌ంబే, వెడ్ టేల్స్, డీజే ఫర్ యు వంటి కంపెనీలు పాలుపంచుకున్నాయి.


కావేరి హాస్పిటల్‌లో గుండెజబ్బుల చికిత్సా కేంద్రం



హైపర్ట్రోఫిక్ కార్డియోమయోపతి సెంటర్ ప్రారంభిస్తున్న కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఈడీ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని ఏవీఎం రోడ్డులోని కావేరి హాస్పిటల్‌లో హైపర్ట్రోఫిక్ కార్డియోమయోపతి క్లినిక్‌ను బుధవారం ప్రారంభించారు. కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ ఈ చికిత్సా కేంద్రాన్ని ఆస్పత్రి వైద్యనిపుణుల సమక్షంలో ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా హృద్రోగ శస్త్రచికిత్సా నిపుణుడు డాక్టర్ పి. మనోహర్ మాట్లాడుతూ హైపర్ట్రోఫిక్ కార్డియోమయోపతి అంటే గుండెకండరాల్లో రక్తం అసాధారణంగా చిక్కగా మారే పరిస్థితి అని, జన్యుకారణాల వల్ల కండరాలు గట్టిపడి గుండెనొప్పి కలిగిస్తుందని చెప్పారు. ఈ రకం నొప్పి గుండెపోటు కంటే తీవ్రమైనదని, సకాలంలో వైద్యపరీక్షలు జరిపితే ప్రాణాపాయం నుండి బయటపడవచ్చునని చెప్పారు. ఈ సమావేశంలో హాస్పిటల్ మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ పూర్ణచంద్రన్, డాక్టర్ సుందర్, డాక్టర్ దీప్ చాందీ రాజా, డాక్టర్ అన్బరసు డాక్టర్ ఆర్ జెబరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పిక్నిక్ స్పాట్‌గా పాడి ఫ్లై ఓవర్



ఫ్లైఓవర్ దిగువన ఏర్పాటైన వాకింగ్ ట్రాక్

వాకింగ్ ట్రాక్ పక్కనే తయారవుతున్న శాండ్ స్పాట్

చిన్నారుల కోసం తమిళ స్వర్ణాక్షరాలు - నక్షత్ర ఆకారంలో నిర్మిస్తున్న వాటర్ ఫౌంటెన్

● స్తంభాలపై అందమైన వర్ణచిత్రాలు ● పార్కును తలపిస్తున్న పచ్చికబయళ్లు

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన పాడి ఫ్లై ఓవర్ దిగువ ప్రాంతాన్ని అందమైన ఉద్యానవన ప్రాంతంగా మార్చేందుకు జీసీసీ అధికారులు చర్యలు చేపట్టారు. యేళ్లతరబడి మట్టికొట్టుకుపోయిన ఆ ఫ్లైవర్ దిగువనున్న స్తంభాలపై నగరంలో చారిత్రక ప్రసిద్ధి చెందిన లైట్‌హౌస్, సెంట్రల్ స్టేషన్, వళ్లువర్‌కోట్టమ్, బీచ్‌లోని శ్రామికుల విగ్రహం, కన్నగి, కామరాజర్, గాంధీవిగ్రహం, తంజావూరు బృహదీశ్వరాలయం, కన్నియాకుమారిలోని తిరువళ్లువర్ విగ్రహం వంటి వర్ణచిత్రాలు వేయించారు. నక్షత్ర ఆకారంలో వాటర్ ఫౌంటెన్‌ని ర్మించారు. దీనికి సమీపంలో పచ్చిక బయళ్లను కూడా ఏర్పాటు చేశారు. అంతే కాకుండా వర్ణచిత్రాలతోపాటు నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్, నగరాభివృద్ధికి తోడ్పడుతున్న ఎంఎండీఏ, హైవేస్ డిపార్ట్‌మెంట్ సింబల్స్ కూడా ఉన్నాయి. వీటన్నింటికంటే ప్రత్యేక ఆకర్షణగా చిన్న పిల్లలకు తమిళ అచ్చులు, హల్లులకు సంబంధించిన అక్షరాలు బంగారు రంగుల్లో ఓ చోట వేలాడదీశారు. ఈ స్పాట్‌కు చిన్నారులతో వెళ్లే పెద్దలు తమిళ అచ్చులు, హల్లులను సులువుగా చెప్పటానికి అనువుగా ఈ తమిళ స్వర్ణాక్షరాలు ఆకట్టుకుంటున్నాయి. మొత్తానికి ఈ పాడి ఫ్లైఓవర్ ప్రాంతం నగరవాసులను ఆకట్టుకోనున్న మరో పిక్నిక్ స్పాట్ అని చెప్పడం అతిశయోక్తి కాదు.



పచ్చటి పచ్చిక బయళ్లు

రామేశ్వరంలో నేడు నిర్విరామ దర్శనం



చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రం రామనాథస్వామివారి ఆలయంలో గురువారం ఆడి అమావాస్య సందర్భంగా భక్తులకు నిర్విరామ దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. ఈ ఆలయంలో ఆడి తిరుకల్యాణోత్సవాలు ఈ నెల 19న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం పర్వతవర్థినీ అమ్మవారు స్వర్ణపల్లకీలో, రాత్రి 8 గంటలకు స్వర్ణ సింహవాహనంపై ఊరేగారు. ఈ నేపథ్యంలో గురువారం ఆడి అమావాస్య సందర్భంగా ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారు స్వర్ణపల్లకీలో, 11 గంటలకు శ్రీరామ చంద్రమూర్తి స్వర్ణ గరుడవాహనంలో అగ్నితీర్థ సముద్రతీరానికి వేంచేయనున్నారు. అక్కడ జరిగే తీర్థవారీ వేడుకల్లో పాల్గొనను న్నారు. ఈ ఆలయాన్ని రోజూ వేకువజాము 4.30 గంటలకు తెరచి మధ్యాహ్నం ఒంటి గంట నుండి 3 గంటల దాకా మూసివేస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు తెరచి ఉంచుతారు. అయితే ఆడి అమావాస్యను పురస్కరించుకుని గురువారం లక్షలాదిమంది భక్తులు రానుండటంతో వేకువజాము 4.30 నుండి రాత్రి 8 గంటల దాకా నిర్విరామంగా దర్శనం కల్పించనున్నారు. ఆడి తిరుకల్యాణోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి 8 గంటలకు అమ్మవారు వెండి రథంలో ఊరేగుతారు. ఈ నెల 27 ఉదయం అమ్మవారి మహారథోత్సవం జరుగనుంది. 29న తపస్సు మండకపడి వద్ద స్వామి, అమ్మవారు మాలల మార్పిడి కార్యక్రమం జరుగుతుంది. 30న స్వామి, అమ్మవార్ల తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఆగస్టు 4న స్వామి, అమ్మవారు శ్రీరాములవారి పాదం మండకప్పడి వద్ద కొలువుదీరుతారు. దీంతో ఆడి తిరుకల్యాణోత్సవాలు ముగియనున్నాయి.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అరుణ్

ప్రజా గ్రీవెన్స్‌లో 21 వినతులు

పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ అరుణ్ హాజరై ప్రజల నుంచి 21 వినతిపత్రాలు స్వీకరించారు. అలాగే వారి సమస్యలు కమిషనర్, స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సమస్యలు విచారించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను కమిషనర్ అరుణ్ ఆదేశించారు.

రామనాథస్వామి హుండీ ఆదాయం రూ.1.14 కోట్లు

పెరంబూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం రామనాథస్వామి వారి హుండీ ఆదాయం రూ.1.14 కోట్లు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు స్వామివారి హుండీల్లో వేసిన కానుకల లెక్కింపు ఆలయ మండపంలో మంగళవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఆలయ జాయింట్ కమిషనర్ చెల్లదురై ఆధ్వర్యంలో జరిగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు రూ.1,14,65,707 నగదు, 61 గ్రాముల బంగారం, 3.200 కిలోల వెండి కానుకగా సమర్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మళ్లీ సీఎం అయ్యేందుకు

స్టాలిన్‌కు అండగా ఉంటాం

● డీపీఐ నేత తిరుమావళవన్



గంగైకొండచోళపురంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న తిరుమావళవన్

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఘన విజయం సాధిస్తుందని, ఆ పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ మళ్ళీ సీఎం సీటులో కూర్చునేందుకు తమ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ స్పష్టం చేశారు.. బుధవారం అరియలూరు జిల్లా గంగైకొండచోళపురం వద్ద జరిగిన రాజేంద్రచోళుడి జయంత్యుత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్ర చోళుడి జయంత్యుత్సవాల్లో పాల్గొనడం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందని అన్నారు. రాజేంద్రచోళుడు విదేశాలపై కూడా దండెత్తి విజయం సాధించాడని, ఆయన పాలనలో నిర్మించిన అద్భుత శిలాఖండాలు నేటికీ చెక్కుచెదరకుండా పర్యాటకులకు ఆకట్టుకుంటున్నాయన్నారు. రాజేంద్ర చోళుడి కీర్తి ప్రతిష్టతలు గురించి భావి తరాలకు అందించే దిశగా ముఖ్యమంత్రి స్టాలిన్ 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.22 కోట్లతో మ్యూజియంను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. స్వల్ప అస్వస్థతకు గురై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్టాలిన్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో స్టాలిన్ నాయకత్వంలోని కూటమిని గెలిపించి ఆయనను మరోసారి సీఎం చేయడమే తన ప్రధాన కర్తవ్యమని, ఈ విషయంలో అండగా ఉంటానని తిరుమావళవన్ శపథం చేశారు.



అయ్యన్నపాత్రుడు - రఘురామకృష్ణ రాజు, గురజాల జగన్మోహన్ - డ్రమ్స్ శివమణి

తిరుమలలో ప్రముఖులు

తిరుమల, జూలై23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం, బీజేపీ నేత అశోక్, డ్రమ్స్ కళాకారుడు శివమణి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, తెలంగాణ ఎమ్మెల్సీ ఎల్ రమణ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడుతూ, ఎంతో నష్టపోయిన రాష్ట్రం ఇప్పుడిప్పుడే అభివృద్ధివైపు అడుగులేస్తోందని అన్నారు. అభివృద్ధిలో అందరం భాగం కావాలని పిలుపునిచ్చారు.

పవన్ సినిమా మాకో పెద్ద పండుగ

● తెలంగాణ టీఎఫ్‌సీసీ కార్యదర్శి శ్రీధర్




టీఎఫ్‌సీసీ సెక్రటరీ శ్రీధర్, నిర్మాత సునీల్ నారంగ్

తిరుమల, జూలై23(ఆంధ్రజ్యోతి): 'దేవుడి దయతో చాలా రోజుల తర్వాత పవన్‌కల్యాణ్ పెద్ద సినిమా 'హరిహర వీరమల్లు' వస్తోంది. మాకో పెద్ద పండుగలా ఉంది. రేపటి నుంచి దీపావళి మొదలవుతుంది' అని తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ సెక్రటరీ శ్రీధర్ అన్నారు. నిర్మాత సునీల్ నారంగ్‌తో కలిసి బుధవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, ఈ చిత్రం పెద్ద హిట్ కావాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని ఆరు షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.



సోమవారం హుండీ ఆదాయం: రూ.4.42 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 79,467


తలనీలాలు సమర్పించినవారు: 28,642



లక్ష్మీవరాహస్వామి



నాలుగు సింహాలు



శంఖునిధి



పద్మనిధి



వ్యాసమహర్షి



సంధ్యాతాండవం శివుడు



మురళీకృష్ణుడు



బయట ప్రధాన గేటు వద్ద శంఖు చక్రం, నామం



అష్టలక్ష్ములు, శ్రీపద్మావతి అమ్మవారు



సీఎంకు బహూకరించే శ్రీనివాసకల్యాణం ప్రతిమ

శయనమూర్తి

సరస్వతీదేవి, లక్ష్మీదేవి

కళ్లు చెదిరే కళాకృతులు

● శిక్షణ దశలోనే విద్యార్థుల నైపుణ్య ప్రతీకలు

మనసును కట్టిపడేసే ఈ శిల్పాలను చూస్తే చేయి తిరిగిన శిల్పి ఎవరో చెక్కారేమో అనిపిస్తుంది. కానేకాదు. అవి శిల్పకళలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు తీర్చిదిద్దిన కళాకృతులంటే ఆశ్చర్యం కలుగుతుంది. తిరుపతిలోని టీటీడీ శిల్పకళాశాలలో నాలుగో ఏడాది (చివరి) విద్యార్థుల చేతిలో కళ్లు చెదిరే ఈ కళారూపాలు రూపుదిద్దుకున్నాయి. శిల, సుధా, దారు, లోహ విభాగాల్లో వివిధ రూపాలను చెక్కి అబ్బురపరిచారు. గోవిందరాజ సత్రాలను కూల్చే సమయంలో లభించిన టేకుతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు, అష్టలక్ష్ములతో కూడిన పద్మావతి అమ్మవారు, ప్రస్తుతం కాళీయమర్ధనంలాంటి శిల్పాలు ముచ్చటగొలుపుతున్నాయి. శిక్షణ పూర్తయ్యాక వెళ్లే క్రమంలో విద్యార్థులు ఇలా మనోహర శిల్పాలతో తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. కళాశాల ప్రాంగణంలో వీటిని కొలువుదీర్చి ప్రత్యేక వన్నె తెచ్చారు. తామెప్పుడైనా కళాశాలకు వస్తే ఈ శిల్పాలు మధురానుభూతిని కలిగిస్తాయని విద్యార్థులు చెప్పారు. కొందరు ఆక్రాలిక్‌షీట్, క్యాన్వాస్‌లపై దేవతామూర్తుల పెయింటింగ్‌లను కూడా వేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



కాళీయమర్థనుడు



దశావతరాలు - వరసిద్ధివినాయకుడి లోహవిగ్రహం







టేకు కొయ్యతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు - శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠనారాయణమూర్తి - సిమెంట్‌తో చేసిన లతాంగులు, నాట్యగత్తెలు

● టీటీడీ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు

25, 26 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 25, 26 తేదీల్లో ఉదయం 8 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. టీటీడీలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ ఉద్యోగుల పిల్లలు, బాలమందిర్ పిల్లలు, సీటు వచ్చి వివిధ కారణాలతో మూడు విడతలలో కౌన్సెలింగ్‌కు హాజరుకానివారికి, స్థానిక విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. ధ్రువీకరణ పత్రాలు, ఫీజులతో నేరుగా సంబంధిత జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావొచ్చు.

ఏరియా ఆస్పత్రుల్లో ట్రైబల్ సెల్

● ఏర్పాటు చేయాలంటూ ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23(ఆంధ్రజ్యోతి): ఏరియా ఆస్పత్రుల్లో ట్రైబల్ సెల్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. మైదాన ప్రాంతాల్లో ఎక్కువగా నివసించే గిరిజనులపై అధికారులు దృష్టిపెట్టి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సంక్షేమ పథకాలపై వారికి అవగాహన కల్పించి, లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. గిరిజనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసుశాఖను ఆదేశించారు.అటవీ ఉత్పత్తుల సేకరణకుగాను గుర్తింపు కార్డులు జారీ చేయాలని అటవీశాఖకు సూచించారు. గిరిజన సంక్షేమ హాస్టళ్లను ప్రతి 15రోజులకు ఒకసారి వైద్యులు సందర్శించి వైద్యసాయం అందించాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఎస్టీలకు సంబంధించి రోస్టర్ అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్, డిప్యూటీ ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మృణాళిని తదితర అధికారులు పాల్గొన్నారు.



చంద్రగిరి కోటలో స్పీకర్

చంద్రగిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోటను బుధవారం అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సందర్శించారు. సెప్టెంబరు 14, 15 తేదీల్లో జరిగే జాతీయ మహిళా సాధికారిత సదస్సులో పాల్గొనే కమిటీ సభ్యులు తర్వాత చారిత్రాత్మకమైన చంద్రగిరి కోటను సందర్శించనున్నారు. ఈ క్రమంలో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, జిల్లా టూరిజం అధికారి జనార్దన్‌రెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, లైటింగ్ షో మేనేజర్ మోహన్ తదితరులతో కలిసి స్పీకర్ కోటను పరిశీలించారు. చంద్రగిరి కోట ప్రాశస్త్యాన్ని తెలిపేలా మ్యూజికల్ లైట్‌షో ఏర్పాటు చేస్తామన్నారు. ఆ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విందు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

→ చంద్రగిరి కోటను సందర్శిస్తున్న స్పీకర్, తుడా చైర్మన్

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● వరదయ్యపాళెంలో నలుగురు, పనపాకంలో ఇద్దరు

● 20 దుంగలు స్వాధీనం

సత్యవేడు/మంగళం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెండు చోట్ల మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం జరిపిన తనిఖీల్లో ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లు పట్టుబడ్డారు. మొత్తం 20 దుంగలు, మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. వరదయ్యపాళెం ఆర్టీసీ బస్టాండు వద్ద ఎస్‌ఐ మల్లికార్జున, సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టరు. శ్రీకాళహస్తి నుంచి వచ్చిన కారు, మినీ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా 11 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాహనాల్లోని లంక వినోద్, కృష్ణ, పెంచలయ్య, అనిల్‌ను అదుపులో తీసుకున్నారు. దుంగలు, రెండు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి.. నలుగురు స్మగ్లర్లపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపామని ఎస్‌ఐ తెలిపారు.

పనపాకం వద్ద టాస్క్‌ఫోర్సు తనిఖీలు



పట్టుబడ్డ స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

చంద్రగిరి మండలం పనపాకం సమీపం సి.మల్లవరం క్రాస్ వద్ద జాతీయ రహదారిపై మంగవారం రాత్రి తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఐ నరేష్ బృందం తనిఖీలు చేపట్టారు. కాస్త దూరంలో ఓ లారీ పక్కకు ఆగింది. అందులో నుంచి ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించగా.. పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వీరు కర్ణాటకకు చెందిన వారని గుర్తించారు. లారీలో తనిఖీ చేయగా తొమ్మిది ఎర్రచందనం దుంగలు లభించాయి. దుంగల సహా లారీని, స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ రఫీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్తు ఇంజక్షన్ వేసుకుంటూ..!

● డ్రోన్‌కు చిక్కిన నలుగురు యువకులు

● కౌన్సెలింగ్ ఇచ్చి తల్లితండ్రులకు అప్పగించిన పోలీసులు



తిరుపతి(నేరవిభాగం), జూలై 23(ఆంధ్రజ్యోతి): చెట్ల పొదల్లో మనల్ని ఎవరు చూస్తారులే అనుకున్నారు. మత్తు ఇంజక్షన్లు వేసుకుంటూ.. మత్తులో మునిగి తేలుతున్నారు. ఇలా తిరుపతి రూరల్ మండలం లింగేశ్వర నగర్‌లో బుధవారం మత్తు ఇంజక్షన్లు వాడుతున్న నలుగురు యువకులను డ్రోన్ కెమెరాతో నిఘా వుంచి పోలీసులు పట్టుకున్నారు. ఇలాంటి వారిని పట్టుకునేందుకు రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు. అలా నిఘా ఉంచిన డ్రోన్ కెమెరాకు.. లింగేశ్వరనగర్‌లోని మారుమూల ప్రాంతంలో పొదల మధ్య మత్తు ఇంజెక్షన్లు తీసుకుంటూ నలుగురు యువకులు చిక్కారు. ఎస్పీ నేతృత్వంలోని ఈగల్ టీమ్‌లు, డ్రోన్ కెమెరాల సిబ్బంది గుర్తించారు. వారిని పట్టుకుని తిరుపతి రూరల్ పోలీసులకు అప్పగించారు. రూరల్ సీఐ చిన్నగోవిందు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. యుక్త వయస్సులో ఇలా చెడు అలవాట్లకు బానిసలుగా మారితే భవిష్యత్ మొత్తం సర్వ నాశనం అవుతుందని హితవు పలికారు. వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించారు. తల్లిదండ్రుల అనుమతితో వారిని వైద్యుల సూచనల మేరకు రీహాబిలటేషన్ కేంద్రానికి పంపి కౌన్సెలింగ్ ఇప్పిస్తామని చెప్పారు.



బర్డ్ ఆస్పత్రిపై సమీక్షిస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో

బర్డ్‌లో అలస్యం లేకుండా

సర్జరీలను పూర్తి చేయండి

● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సూచన

తిరుపతి(వైద్యం), జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని బర్డ్ (బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ రిహాబిలిటేషన్ ఫర్ ద డిజేబుల్)కు వచ్చే రోగులు సర్జరీల కోసం ఎదురు చూడకుండా.. ఆ సమయాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు సూచించారు. తిరుపతిలోని శ్రీపద్మావతి అతిథి గృహంలో బుధవారం ఆయన టీటీడీ ఈవో శ్యామలరావుతో కలిసి బర్డ్ అధికారులతో సమీక్షించారు. అవసరమైన వైద్య పరికరాలు, మందులు, వైద్యులను, సిబ్బందిని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కీళ్ల మార్పిడి తదితర శస్త్ర చికిత్సలకు అవసరమైన విదేశీ పరికరాలను మరింత నాణ్యమైన వాటిని ఎంపిక చేసుకొని మన ధరలకు అనుగుణంగా సేకరించాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చక్కటి గుర్తింపు ఉన్న బర్డ్‌ను గత కొంతకాలంగా నిర్వీర్యం చేయడం బాధాకరమన్నారు. తిరిగి బర్డ్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బర్డ్‌పై నమ్మకంతో వచ్చే రోగుల నమ్మకాన్ని నిలబెట్టేలా వైద్య సేవలు అందించాలని సూచించారు. 'శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలలో చిన్నపిల్లల గుండె శస్త్ర చికిత్సలకు దాతలు విరాళాలు ఇచ్చే అపన్న హృదయ పథకం ఉంది. బర్డ్‌లోనూ అర్హులైన నిరుపేదలకు శస్త్ర చికిత్సలు చేసేందుకు దాతల నుంచి విరాళాలు సేకరించే అంశంపై సంబంధిత అధికారులు సంయుక్తగా నివేదిక తయారు చేయాలి' అని ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. అధునాతన వైద్య పరికరాలను నిబంధనల మేరకు కొనుగోలు చేయాలన్నారు. దివ్యాంగ పిల్లలకు తక్షణమే సర్జరీలను చేస్తున్నామని బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ చెప్పారు. జాయింట్ రీప్లేస్మెంట్‌లకు మాత్రమే ఏడాది సమయం పడుతోందన్నారు. అనంతరం బర్డ్ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, అభివృద్ధి పనులను ఆయన పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు నన్నపనేని సదాశివరావు, జేఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

భవనాల నాణ్యతలో రాజీ వద్దు

స్విమ్స్ ఆవరణలో నిర్మిస్తున్న భవనాల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా చూడాలని అధికారులను టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు ఆదేశించారు. స్విమ్స్‌లో నిర్మిస్తున్న పలు విభాగాలకు సంబంధించిన భవనాలను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను, వైద్య పరికరాలను, సిబ్బందిని త్వరితగతిన పూర్తి చేసి రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్యసేవలు అందించాలన్నారు. స్విమ్స్ అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యులు సుచిత్ర ఎల్లా, సదాశివరావు, జేఈవో వీరబ్రహ్మం, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, సీఈ సత్యనారాయణ, ఎస్ఈలు మనోహర్, వెంకటేశ్వర్లు, ఎంఎస్ డాక్టర్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తీసుకొస్తున్న ఇద్దరి అరెస్టు

● నాలుగు కిలోలు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం భూమయ్యగారి పల్లికి చెందిన గూలూరు చంద్రమోహన్, అదే ప్రాంతానికి చెందిన ఇరసపల్లి అరుణ్‌కుమార్ స్నేహితులు. సులభ సంపాదనకు అలవాటు పడ్డారు. తెలిసిన వారి ద్వారా గంజాయి తీసుకొచ్చి తిరుపతిలో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం వెళ్లారు. శ్రీకాకుళం నుంచి మనోహర్ గంజాయి తీసుకొచ్చి భద్రాచలంలో భారీగా విక్రయిస్తుంటాడు. అతడి వద్ద వీరు రూ.80 వేలకు నాలుగు కిలోల గంజాయి కొన్నారు. రైలులో దిగి తిరుచానూరు రోడ్డు వైపు నడుచుకుంటూ వెళ్తున్నారు. దీనిపై ఈస్ట్ సీఐ శ్రీనివాసులకు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ హేమాద్రి, సిబ్బంది కలిసి వారిని పట్టుకున్నారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి ప్రధాన నిందితుడు మనోహర్ కోసం ప్రత్యేక బృందాలను నియమించారు.